



# ఏ వెండి.. పెరుగుతుందండీ!

- రూ.లక్షకు చేరువలో వెండి ధరలు
- కిలో రూ.99,800.. బంగారం పైపైకే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వెండి ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఇవాళ్టికిలో వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.99,800గా ఉంది. బంగారం ధర పది గ్రాముల 22 క్యారెట్ ధర 80,350 అయింది. ఇంకా ఈ ధరలు పెరిగే అవకాశాలున్నట్టు మార్కెట్ అంచనా. బంగారం, వెండి ఆభరణాలంటే మహిళలకు ఎంతో మోజు. పురుషులూ ఈమధ్య వీటిపై మోజు పెంచుకుంటున్నారు. సాధారణంగా వెండి కంటే బంగారం ధరించడానికి స్త్రీ, పురుషులు ఇష్టపడతారు. వెండితో సాధారణంగా ప్లేటులు, గ్లాసులు వంటి వస్తువులను ఇంటిలోకి ఉపయోగిస్తారు. పూజా సామగ్రి కూడా వెండివే వినియోగిస్తారు. ఇటీవల పెట్టుబడి కింద కూడా వెండిని ఉపయోగిస్తున్నారు. వెండిబారులు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ఇవి 50 గ్రాముల బారు నుంచి కిలో బారు వరకూ ఉంటుంది. ఇవికాకుండా గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలకు ధరించే ట్రెండ్ నడుస్తోంది. వెండి పట్టీలు ఎలాగూ ప్రతీ మహిళా ధరిస్తారు. బంగారం ధరలు పెరగడం, చోరీల నుంచి రక్షణ పొందేందుకు ఇలా వెండి నగలను ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారం ధరతోపాటు వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులూ వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. కొంతకాలంగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పోటీపడుతుండడం విశేషం. గతవారంలో కిలో వెండి ధర రూ.99,900 పలికింది. తర్వాత రూ.200 తగ్గి కిలో రూ.99,700గా కొనసాగింది. బుధవారం మళ్లీ పెరిగిపోయి 99,800 అయింది. ఇది ఇంకా తగ్గుతుందా, పెరుగుతుందా అనే అంచనా వేయలేని పరిస్థితి ఉంది. అయితే కిలో వెండి రూ.లక్ష ధర పలికే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. వినియోగదారులు ప్రస్తుతం వెండి కొనుగోలు చేద్దామంటే ధర ఎక్కువ ఉంది. తర్వాత కొనుగోలు చేయవచ్చని వాయిదా వేద్దామంటే మరింత పెరిగిపోతుందేమోననే ఆందోళన ప్రజల్లో ఉంది. జనవరి ఒకటిన కిలో వెండి ధర రూ.88,400 ఉంది. నెలా పదిహేను రోజుల తర్వాత అంటే ఇవాళ కిలో ధర రూ.99,800లకు చేరింది. బుధవారం నాడు బంగారం 22 క్యారెట్ పది గ్రాముల ధర 80,350, 24 క్యారెట్ బంగారం ధర రూ.87,650 ఉంది.

# చిదిమేస్తున్నారు!

## మోసగాళ్ల చెరలో మైనర్లు




మాయమాటలో, విష సంస్కృతో అభంశుభం తెలియని బాలికలను విష వలయంలోకి నెట్టేస్తోంది. ఆ వలయంలో చిక్కిన వారి జీవితాలు అగాధంలో పడిపోతున్నాయి. తర్వాత లేచి చూస్తే.. అంతా చీకటే. ఎంతో భవిష్యత్తును చూడాల్సిన మైనర్లు జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. మైనర్లపై ఇటీవల అత్యాచారాలు జరుగుతున్న ఉదంతాలెన్నో నమోదవుతున్నాయి. ఈవారం పది రోజుల్లోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ఘటనలు పోలీసు కేసులయ్యాయి. కేసుల దాకా రానివీ మరెన్నో ఉంటాయి. వీరికి న్యాయం జరుగుతుందా, నిందితులకు శిక్ష పడుతుందా.. ఇంతవరకే మనం ఆలోచించగలం. కానీ అఘాయిత్యానికి గురైన మైనర్లు, మహిళల భవిష్యత్తు మాత్రం గాఢాంధకారమే. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొంతవరకైనా కట్టడి అయ్యే అవకాశం ఉంటుంది.

- బాలికలకు భద్రత కరవు
- పోక్సో కేసులే దానికి రుజువు
- రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ప్రేమ పేరుతో వలలో చిక్కుతున్న యువతులు
- స్మార్ట్ ఫోన్ల బంధాలతోనూ వాటిల్లుతున్న పెనుముప్పు
- జిల్లాల్లో పెరిగిపోతున్న మిస్సింగ్ కేసులు

(రాజమహేంద్రవరం/సామర్లకోట/మండపేట/ముమ్మిడివరం/మలికిపురం- ఆంధ్రజ్యోతి)

బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. ప్రధానంగా ప్రేమపేరుతో బాలికలు, యువతులు మోసగాళ్ల చెరలో చిక్కుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మిస్సింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. దీనికి కుటుంబ పరిస్థితులు, గృహహింస, తల్లిదండ్రుల సంబంధాలు, తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉండడంతో ఒంటరితనం, మద్యం వంటి వాటికి బానిస కావడం, పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఆకర్షణలకు గురికావడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని కిర్లంపూడి పీహెచ్‌సీలో వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ చెప్పారు. నిజమే, ప్రధానంగా స్మార్ట్‌ఫోన్ల వల్ల ఆడ, మగ తేడా లేకుండా జీవితాలు పట్టు తప్పుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యాచారం, అదృశ్యం కేసుల్లో లోతుల పరిశీలన చేస్తే చివరికి సెల్‌ఫోన్ కారణమని తేలుతోంది. కలిసి చదువుకుంటున్నాం.. కలిసి తిరిగేస్తే తప్పేంటనే తొందరపాటే అమ్మాయిల జీవితాలను ప్రశ్నల కూపంలోకి నెట్టేస్తోంది. ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

### ఇవి కొన్నే...

#### మాయ మాటలతో వ్యభిచారంలోకి

అనకాపల్లి జిల్లాకు చెందిన 17ఏళ్ల బాలికను కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చందు ప్రేమపేరిట మాయమాటలు చెప్పి గతేడాది చివరల్లో ఇక్కడకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత తన ప్రణాళిక ప్రకారం బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు తన తల్లిని వినియోగించాడు. ఈ కూపంలో ఆ బాలికకు ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యం చేయించారు. బాధలతోపాటు తల్లీకొడుకులు పెట్టే బాధలు భరించలేక గతేడాది చివర్లోనే ఆమె చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్సలో ఆ బాలిక ఆరోగ్యం మరింత క్షీణించింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో తీగలాగితే డొంక కదిలింది. పెద్దాపురం పోలీసులు రంగప్రవేశం చేసి బాలికను మోసగించి, వేధింపులకు పాల్పడిన తల్లీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో అవసానదశలో చికిత్స పొందుతోంది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

#### 8వ తరగతి బాలికను చెరపట్టి...

ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన పరమట దుర్గాప్రసాద్ (30) ఎలియాస్ బులిచంటి 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికపై కన్నేశాడు. గత సోమవారం ఆ బాలిక ఇంటి నుంచి పాఠశాలకు తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లి స్కూలు వద్ద బస్సు దిగగా దుర్గాప్రసాద్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెకు మాయ మాటలు చెప్పి బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక నివాస గృహంలోకి తీసుకువెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ విషయం తెలిసిన ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆ బాలికను వైద్య పరీక్షలకు పంపించి నిందితుడిపై పోక్సో అత్యాచార కేసును నమోదుచేశారు.

#### ప్రేమ పేరిట వేధించి.. ఆత్మహత్యకు పురిగొల్పి..

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నంలో అనుసూరి విఘ్నేశ్ అనే యువకుడి వేధింపులకు తాళలేక మూడు రోజుల కిందట 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో అతడు ఆ బాలికను ప్రేమపేరిట వేధించేవాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు అప్పట్లో అతడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొన్నాళ్లకు బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు ఆ బాలిక వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. మాయమాటలకు లొంగిన ఆ బాలిక వివాహం చేసుకుంది. కొంతకాలం అదే గ్రామంలో ఇద్దరూ కాపురం పెట్టారు. ఇటీవల కాలంలో ఆమెపై వేధింపులు పెరిగాయి. రెండు రోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలు జరగ్గా ఆమెను శారీరకంగా వేధించాడని తెలిసింది. సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విఘ్నేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

#### ఫొటోలు పంపి.. వేధించాడు...

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఓ యువకుడు పదేపదే ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. ఆమె ఎన్ని ఫోన్ నెంబర్లు మార్చినా ఫలితం లేకపోతోంది. చివరికి ఆమె తండ్రికి ఆమె పర్సనల్ ఫొటోలు పంపించాడు. అది చూసి ఆ తండ్రి గుండె పగిలినంత పనైంది. కూతురిని గట్టిగా నిలదీస్తే కథ బయటకు వచ్చింది. ఆ కుర్రాడు ఆ అమ్మాయితో చదువుకున్నవాడే. ఆ రోజుల్లో చనువుండేది. ఇప్పుడు ఆ అమ్మాయికి పెళ్లి నిశ్చయం కావడంతో ఆ అబ్బాయి తీరు విపరీతమైంది.

#### పెళ్లి చేసుకుంటానని లోబరుచుకుని..

మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్ అదే పట్టణంలో పదవ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేశాడు. ఇతడికి ఇంతకుముందే వివాహమై కుమారుడు కూడా ఉన్నారు. నిందితుడి ఇంటికి సమీపంలోనే ఆ బాలిక కుటుంబం ఉండడంతో పరిచయం పెంచుకుని అఘాయిత్యానికి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబరుచుకున్నట్టు తేలింది.

#### సోషల్ మీడియా ఓ కత్తి..

సోషల్ మీడియా ఓ కత్తి వంటిది. దానితో మంచి చెడూ రెండూ ఉన్నాయి. అయితే చెడు మార్గంలోకి వెళ్లడానికి ఈరోజు యువత దానిని ఎక్కువగా వాడుతోంది. చెడు కంటెంట్ కూడా విపరీతమైన లభ్యత వల్ల బాలలు సైతం కొన్ని కేసుల్లో ఉండడం మనం చూస్తున్నాం. పిల్లల సెల్‌ఫోన్లను పెద్దలు గమనిస్తూ ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహభావంతో మెలుగుతూ అన్ని విషయాలనూ గమనిస్తూ, ఆరా తీస్తూ ఉండాలి. ఆదర్శనీయులు, మార్గదర్శకులు, నీతి కథలు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు వంటి వాటిని నూరిపోస్తూ ఉంటే మంచిది.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు

#### ఆత్మరక్షణపై శిక్షణ ఉండాలి

అత్యాచారాలు, అఘాయిత్యాల నుంచి తప్పించుకునేందుకు అవగాహనతోపాటు ఆత్మరక్షణపై పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలి. ప్రతీ ఒక్కరు బాలికలకే జాగ్రత్తలు చెబుతారుతప్ప బాలురకు కౌన్సెలింగ్‌గానీ, శిక్షణగానీ ఇవ్వడం లేదు.. బాలికలతో బాలురు ఎలా మెలగాలనేది కూడా కుటుంబ స్థాయిలోనే పెంపకంలోనే అలవాటు చేయాలి. వీటికి తల్లే ముఖ్య బోధకురాలు కావాలి. బాల్య దశలోనే నీతి సూత్రాలు, మంచి కథలు వినిపించాలి.

- నల్లి సన్‌షైన్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

# నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు


రిజిస్ట్రేషన్లకు అంతరాయం కారణంగా పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి చూస్తున్న ప్రజలు

- సర్వర్లలో సాంకేతిక సమస్యలు
- జిల్లా అంతా ఇదే పరిస్థితి
- తరచూ సర్వర్ల సమస్యలతో తప్పని ఇక్కట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సర్వర్లల్లో తలెత్తిన సాంకేతిక లోపాలతో జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలవద్ద క్రయ, విక్రయదారులు పడిగాపులు పడ్డారు. ఇటీవలకాలంలో తరచూ వస్తున్న సర్వర్ల సమస్యతో ఇబ్బందులు తప్పట్లేదు.

స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖకు చెందిన సెంట్రల్ సర్వర్ తలెత్తిన సాంకేతిక సమస్యలతో అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం వరకూ ఈ సమస్యను పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో జిల్లాలోని కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, సర్పవరం, సామర్లకోట, ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట, తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భూములు, భవనాలు, ఇతర ఆస్తుల క్రయ, విక్రయాలను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన వారు పడిగాపులు పడ్డారు. ఉదయం అరగంటపాటు సర్వర్లు పనిచేసి చివరకు వచ్చేసరికి ఈ-సైన్ అవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపివేశారు. ప్రస్తుతం ఈ-సైన్ విధానంలోనే రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తుండడంతో మొత్తం ప్రక్రియలో ఇదే కీలకంగా మారింది. సర్వర్లు మరమ్మతులు చేస్తున్నామని, గంట, రెండు గంటల్లో సరి చేస్తామని మధ్యాహ్నం 12గంటల సమయంలో సమాచారం ఇచ్చినా సాయంత్రం వరకూ సరికాలేదు. దీంతో ఏ రిజిస్ట్రేషన్లు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి చూసిన క్రయ, విక్రయదారులు నిరాశతో వెనుతిరగారు.

#### శ్లాట్ బుక్ చేసుకుని వచ్చినా..

హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న తాము స్థలం రిజిస్ట్రేషన్ కోసం ముందుగానే స్లాటు బుక్ చేసుకుని వచ్చామని కాకినాడ రిజిస్ట్రార్ కార్యాలయంవద్ద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన ఒక ఐటీ ఉద్యోగి తెలిపారు. వెంటనే పని పూర్తవుతుందని ఒక రోజే సెలవు పెట్టుకుని వచ్చామని, ఇప్పుడు మరుసటిరోజు రావాలని చెప్తున్నారని అన్నారు. రెండునెలలుగా రిజిస్ట్రేషన్‌శాఖ సర్వర్లలో తరచూ సాంకేతిక సమస్యలతో సర్వర్లు డౌన్ అవుతుండడంతో ఇక్కట్లు తప్పడంలేదు.

## రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాంలపై ఆహారాల విక్రయాల్లో
# శుచి, రుచి, నాణ్యత ఉండాలి

- విజయవాడ రైల్వే డివిజన్ డీసీఎం
- సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీసీఎం రాంబాబు

సామర్లకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాల్లో శుచి, రుచి, నాణ్యతా ప్రమాణాలు ఉండాలని, వీటితోపాటు రైల్వే నిర్ధేశించిన ధరలకు విక్రయించేలా రైల్వే కమర్షియల్ అధికార యంత్రాంగం కృషి చేస్తుందని విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం రాంబాబు అన్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ శాలతోపాటు ఆయా ప్లాట్‌ఫాంలపై ప్రయాణికులకు విక్రయించేందుకు ఫుడ్ స్టాల్స్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సామర్లకోట రైల్వేసూపరింటెండెంట్ ఎం.రమేష్, కమర్షియల్ అధికారులు, టీసీలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఐఆర్‌సీటీసీ లోపల విభాగాలను పరిశీలించారు. ప్లాట్‌ఫాంలపై ఉన్న ప్రతి స్టాల్ ఎదుట ఆహార విక్రయాలకు సంబంధించి ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. బయట తయారుచేసిన సమోసాలు, ఇడ్లీలు వంటి ఆహార పదార్థాలను రైళ్లల్లో ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదన్నారు. ఐఆర్‌సీటీసీద్వారా విక్రయించే సిబ్బంది చొక్కాకు బ్యాడ్జ్ తగిలించుకోవాలన్నారు.

## భక్తులకు ఇబ్బంది కలిగేలా వేషాలు వేస్తే..
# కాళ్లు విరగ్గొట్టి లోపల వేయిస్తా

- ఇది సీరియస్ వార్నింగ్: కలెక్టర్ షాన్‌మోహన్
- సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


మహాశివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సామర్లకోట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామర్లకోట భీమేశ్వరాలయంలో భక్తులకు ఇబ్బంది కలిగేలా ఎవరు వేషాలు వేసినా కాళ్లు విరగ్గొట్టి లోపల వేయిస్తానని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహాశివరాత్రిరోజున కేటాయించిన క్యూలైన్లలో రావాలని, ఎంట్రీ, ఎగ్జిట్‌ల్లో భక్తులకు ఇబ్బందులుకలిగేలా ఎవరు వేషాలు వేసినా.. వారు ఎంతటివారైనా పర్సనల్‌గా కేసులు నమోదు చేయిస్తానని, ఇది సీరియస్ వార్నింగ్ అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆలయంలో పుష్కరిణిలను, పార్కింగ్, అన్నదానాలు, పంపిణీలను కలెక్టర్ పరిశీలించారు. అధికసం ఖ్యలో భక్తులు వాహనాల్లో విచ్చేయనున్నందున సామర్లకోట-కాకినాడరోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకునే బాధ్యత పోలీసులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సామర్లకోటఆలయంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్‌లతో ఆయన సమీక్షించారు. కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా దేవదాయాధికారిణి, సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, ఏఎస్పీ మానిష్‌పాటిల్ దేవరాజ్, దేవదాయ ఉపకమిషనర్ డీఎల్వీ రమేష్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్‌కుమార్, కంటే జగదీష్‌మోహన్, తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డి, ఆలయ ఈవో బళ్ల నీలకంఠం పాల్గొన్నారు. అంతకుముందుభీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించుకున్నారు.

# పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తే చర్యలు

- కాకినాడ జిల్లా సమీక్షా సమావేశంలో మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు


మునిసిపల్ కమిషనర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు

పిఠాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పురపరిపాలనాశాఖ రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు హెచ్చరించారు. ఆరునెలలుగా సమావేశాలునిర్వహిస్తున్నా వసూళ్ల మందకొడిగా సాగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో జిల్లాలోని పిఠాపురం, సామర్లకోట, తుని, పెద్దాపురం మునిసిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బందితో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లల్లో ఏలేశ్వరం, తుని, సామర్లకోట వెనుకబడి ఉన్నాయని, నీటి పన్ను వసూళ్లలో పిఠాపురం మునిసిపాలిటీ, ఏలేశ్వరం నగర పంచాయతీలు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో మార్చి నెలాఖరు నాటికి రూ.132కోట్లు ఇంటి పన్నుల రూపేణా వసూలు కావాల్సిఉండగా రూ.54కోట్లు మాత్రమే వసూలై 41శాతంగా ఉందని వివరించారు. వాటర్ ట్యాక్స్ రూపేణా రూ.24.87కోట్లు వసూలు కావాల్సిఉండగా రూ.6.09కోట్లు మాత్రమే వసూలైందని తెలిపారు. పన్నుల వసూళ్ల నూరుశాతం జరిగితే అదనంగా ప్రభుత్వ గ్రాంట్లు వస్తాయని తెలిపారు. జగ్గయ్య చెరువు అడ్మిన్ సెక్రటరీ పనితీరు సరిగా లేదని, అనుమతులు లేకుండా తరచూ సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె హెల్త్ కండిషన్‌పై మెడికల్ బోర్డుకు లేఖ రాసినట్లు తెలిపారు. కుళాయిలకు మునిసిపాలిటీల్లో మీటర్లు వేయడం లేదని, వేసినా దాని ప్రకారం పన్నులు విధించడం లేదని దీనివల్ల పురపాలక సంఘాలు ఆదాయం కోల్పోతున్నాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆరు పురపాలకసంఘాల కమిషనర్లు, ఆర్వోలు, ఆర్ఐలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సెక్షన్ 163 అమలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లపరిధిలో సెక్షన్ 163(2) బీఎన్ఎస్ఎస్ అమలవుతుందని, దీని ప్రకారం ఐదుగురి కంటే ఎక్కువమంది గుమిగూడకూడదని, సభలు, సమావేశాలు పెట్టకూడదని, ఆయుధాలు, కర్రలు, రాళ్లు, అగ్నిప్రమాదాలు సంభవించే వస్తువులు, ఇతర ఆయుధాలు పట్టుకుని తిరగడాన్ని నిషేధించామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈనెల 25న సాయంత్రం 4గంటల నుంచి 28న సాయంత్రం 6గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎవరు సమావేశాలు నిర్వహించడం, గుంపులుగా తిరగడం, ర్యాలీలు నిర్వహించడం చేయకూడదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు, పబ్లిక్ మీటింగులు ఈనెల 25న సాయంత్రం 4గంటల నుంచి 28న సాయంత్రం 6గంటల వరకు నిషేధించామని కలెక్టర్ తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించాలి: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జిల్లాలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సెక్టార్, రూట్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాలపట్టభద్రుల నియోజకవర్గ ఏఆర్వో, డీఆర్వో వెంకట్రావు ఆదేశించారు. తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం కాకినాడ కలెక్టరేట్ హాల్‌లో సెక్టార్, రూట్ అధికారులు, తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ ప్రక్రియ 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 70,540 మంది ఓటర్లకు 98పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 21 సెక్టార్ అధికారులను నియమించామన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను సురక్షితంగా కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించేవరకు బాధ్యతతో పనిచేయాలన్నారు.



## ఏర్పాట్లు చాలా బాగున్నాయి

**యోగేష్ పరబ్, స్టేట్ స్పోర్ట్స్ ఆర్గనైజర్, గోవా**

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్స్‌కి చాలా రాష్ట్రాలకు వెళ్లాను. కానీ కాకినాడలో క్రీడాకారుల పట్ల చూపిన అభిమానం ఎక్కడా చూడలేదు. బస చేసేందుకు హోటల్ రూమ్స్, వెళ్లి, వచ్చేందుకు ట్రావెలింగ్, భోజన ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన మైదానం ఆటకు ఎంతో అనుకూలంగా ఉంది.



## ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడాలన్న కల నెరవేరింది

**బి.సురేష్‌రాజు, ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్**

ప్రతి హాకీ క్రీడాకారుడికి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడడం ఒక కల. ఆ కల కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో నెరవేరింది. ఈ గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తూ ఆడొచ్చు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోవాపై టీమ్ స్పిరిట్‌తో గెలిచాం. ఆ గెలుపు మా జట్టుకు మరింత స్ఫూర్తినిచ్చింది.



## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

**మారేశ్వరన్, సీబీడీటీ టీమ్, తమిళనాడు**

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలున్న మైదానంలో ఆడడం చాలా బాగుంది. బ్లూ టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటను ఆస్వాదించగలుగుతున్నాం. 2022లో ఆసియా క్రీడల్లో బ్రాంజ్ మెడల్ సాధించాం. జూనియర్స్, సీనియర్స్‌లో ఇండియా తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడాను.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)



పురుషుల విభాగంలో చండీఘర్, బెంగళూరు మధ్య హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్

# హాకీ క్రీడోత్సాహం

**కాకినాడలో ఐదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు**




గోల్ చేయడానికి రెడీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు జరిగాయి. ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్, హైడ్రాలజీ శాస్త్రవేత్త సత్యాజీరావు, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ భువనేశ్వర్, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చండీఘర్, ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ బెంగళూరు 4-1 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ సెక్రటేరియట్ 21-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్బీ అహ్మదాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... సెంట్రల్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 13-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 18-0 తేడాతో విజయం సాధించింది.



విజయం అనంతరం హాకీ స్టిక్‌ని ముద్దాడుతున్న క్రీడాకారిణి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్



మహిళల విభాగంలో కేరళ వర్సెస్ ఛత్తీస్‌గఢ్



ప్రమాణస్వీకారం అనంతరం ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం

# సేవా తత్పరులు ఆర్యవైశ్యులు

**ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి**

**అన్నవరంలో అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం**

అన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం కాకినాడ జిల్లా అన్నవరంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో బుధవారం జరిగింది. ముందుగా సంఘ సభ్యులు సత్యదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువున గౌరవాధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబి, కార్యదర్శిగా కుసుమంచి పాపారావు, కోశాధికారిగా కంచర్ల కృష్ణమోహన్, సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో ఏర్పడిన ఈ కమిటీ అంతా పేద వైశ్యుల సంక్షేమానికి పాటుపడడమే కాకుండా వాణిజ్యపరంగా ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా ముందుండాలన్నారు. అధ్యక్షుడు కంచర్ల బాబి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి న్యాయం చేకూరుస్తానన్నారు. అందరి కష్టాల్లో పాలుపంచుకోవడమే కాకుండా ఆర్యవైశ్యులు అంటే సేవాతత్పరులు అనే భావనకు మరింత వన్నె తెస్తానన్నారు. జోనల్ చైర్మన్ బత్తుల నానాజీ, మండవల్లి వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, దాసరి శ్రీనివాస్, జయవరపు విహారి, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు మండలం పాదురుపాకలో పార్వతి ఇంటి ఆవరణలో పెళ్లి పందిరి

# కీర్తిశేషులకు పెళ్లి

**పాండవులపాలెం పంచాయతీ పాదురుపాకలో వెలుగుచూసిన ఘటన**

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరణించిన 20 ఏళ్ల తర్వాత ఓ జంటకు పెళ్లి జరిగింది. ఆశ్చర్యపోతున్నారా! మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మరణించిన తర్వాత వారి తల్లిదండ్రుల వివాహం జరిపించేందుకు వారి కుటుంబీకులు సిద్ధమైన అరుదైన ఈ సంఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామ పంచాయతీ పాదురుపాకలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాదురుపాకకు చెందిన సోమాల బాబూరావు-భూలక్ష్మి దంపతుల కుమార్తె పార్వతి వివాహ వయసు వచ్చిన తర్వాత (ఇరవై ఏళ్ల కిందట) చనిపోయింది. అదే గ్రామానికి చెందిన ఇరకనూకరత్నం కుమారుడు రాంబాబు 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. వీరిలో పార్వతి రాంబాబును ఇష్టపడి జీవించిన కాలంలో పెళ్లి చేసుకోవాలనుకునేది. వివాహం జరగకుండానే పార్వతి మృతి చెందింది. ఆ తర్వాత రాంబాబు కూడా మృతి చెందాడు. ఇటీవల పార్వతి తన కుటుంబ సభ్యుల కలలోకి వచ్చి తమకు పెళ్లి చేయాలని కోరింది. దీంతో ఇరు కుటుంబాల వారు మరణించిన పార్వతి, రాంబాబులకు హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి పందిరి వేసి బుధవారం వివాహం జరిపించారు. గ్రామస్తులకు విందు భోజనాలు కూడా పెట్టారు. ఇది ఆనోటా, ఈనోటా బయటకొచ్చింది.



రజత కవచాలను సమర్పిస్తున్న భరత్‌కుమార్, సింధూర

## రమా సత్యనారాయణస్వామికి 5.700 కిలోల వెండి కవచం సమర్పణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామికి బుధవారం యానాంకు చెందిన కర్రి సుబ్బిరెడ్డి-హైమావతి దంపతుల కుమారుడు భరత్‌కుమార్-సింధూర దంపతులు 5.700 కిలోలతో రజత కవచం చేయించారు. బుధవారం దానిని ఆలయ సహాయ కమిషనరు, ఈవో అల్లు వెంకట దుర్గాభవానీకి సమర్పించారు. వెండి కవచాలకు దేవులపల్లి ఫణిరామకృష్ణ సంప్రోక్షణ చేయించారు. అనంతరం అర్చకుడు కొంతేటి శ్రీనివాస భీమశంకరం స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.




రజత కవచాలంకరణలో స్వామి, అమ్మవార్లు

## ఆర్ట్స్ కళాశాలలో నేటి నుంచి ఉద్భవ్ యూత్ ఫెస్టివల్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్-2025 పేరుతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నేషనల్ యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్ ఈవెంట్స్‌లో భాగంగా క్లాసికల్ డ్యాన్స్, పేట్రియాటిక్ డ్యాన్స్, లైట్ మ్యూజిక్, ఫోక్, ట్రైబల్ డ్యాన్స్, ఫిల్మ్ డ్యాన్స్ జరుగుతాయన్నారు. కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.



పొల్లూరు జలపాతం వద్దకు స్వామివారిని తీసుకొస్తున్న దృశ్యం (పాత చిత్రం)

# గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర

**వచ్చే నెల 3న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహణ**

మోతుగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర. దీనిని ఒడిశా ప్రభుత్వం ప్రతి రెండేళ్లకోసారి అధికారంగా నెల రోజులు నిర్వహిస్తుంది. అయితే మార్చి 3న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద ఒక రోజు జాతర జరుపుతారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా మన్యంకొండ గ్రామంలో ఉన్న గిరిజన వనదేవతలు కన్నమరాజు (శ్రీకృష్ణుడు), బాలరాజు (అర్జునుడు), పోతురాజు (భీముడు), ముత్యాలమ్మ తల్లి ఘటం ధ్వజాల రూపంలో పూజలు అందుకుంటాయి. వీటికి ప్రతి రెండేళ్లకోసారి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని మోతుగూడెం వద్ద ఉన్న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహించడం ఆచారంగా వస్తోంది..

మోతుగూడెంలో మన్యంకొండ జాతరను తిలకించడానికి వేరే రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో గిరిజనులు తరలివస్తారు. ఫిబ్రవరి 11న మొదలైన జాతర మార్చి 12 వరకు కొనసాగుతుంది. పొల్లూరు జలపాతం వద్ద మార్చి 3న ప్రధానమైన మంగళస్నానం, ప్రాణ ప్రతిష్ఠ జరుగుతాయి. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి రూపం లేకుండా ఉన్న ముత్యాలమ్మ తల్లి ఘటం, ధ్వజం రూపంలో ఉన్న సోదరులు (కన్నమరాజు, బాలరాజు, పోతురాజు)తో కలిసి మన్యంకొండ చేరుకుంటుంది. అదే సమయంలో మోతు బ్లాక్‌లో ఉన్న నడవనపల్లి గ్రామంలో నుంచి గద్వాల కోసం కొత్త వెదురులను తీసుకుని పూజారులు మన్యం కొండ వస్తారు. కొండ గృహాలు ఉన్న మూల రూపాలకు ప్రత్యేక పూజలు చేసి బోయ యాత్రకు బయల్దేరతారు. ఈ యాత్రలో వేలాదిగా గిరిజన భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా కొండకోనలు ఎక్కుతూ వాగులు, వంకలు దాటుతూ వన దేవతతో పాటు నడక సాగిస్తారు.

సంప్రదాయంగా మేళతాళాలు, థింసా నృత్యంతో సీలేరు నది ఆనుకుని ఉన్న ఒడిశాలోని అవతల పొల్లూరుకు మార్చి 2న జాతర చేరుకుంటుంది. మార్చి 3 ఉదయం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత కొత్తగా తయారు చేసిన ప్రత్యేక పడవలపై వన దేవతలను నది దాటించి ఆంధ్రాలోని పొల్లూరు జలపాతం వద్దకు తీసుకొస్తారు. అక్కడ వనదేవతలకు మంగళస్నానం చేయించి పాత ధ్వజాలను నిర్వీర్యం చేసి కొత్త ధ్వజాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి భక్తులు దర్శించుకునేందుకు జలపాతం వద్ద ఉంచుతారు. అనంతరం బలి పూజ చేసుకుంటారు. తిరిగి ప్రయాణమై మన్యంకొండకు చేరుకుంటారు. ఈ జాతరను వీక్షించడానికి సుమారు 20వేల మంది భక్తులు తరలివస్తారు.

పొల్లూరు వద్దకు చేరుకున్న తర్వాత వన దేవతలకు జలపాతం చెంతన ఉన్న గృహంలో ప్రత్యేక పూజలు చేస్తారు. పూజలకు సంతృప్తి చెందిన ముత్యాలమ్మను జలపాతంలో బంగారు చేప రూపంలో పూజరులు భక్తులకు దర్శనం చేయిస్తారని నమ్మకం. వన దేవతలతో పాటు జలపాతంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పోటీపడతారు. అనంతరం జలపాతం వద్ద ఉంచిన ఆసనంపై అలంకరించిన వన దేవతలను భక్తులు దర్శించుకుంటారు.

# వయసు నూరేళ్లు... ఖరీదు 35 లక్షలు

**● కడియం నర్సరీలో వింతైన రూపంతో ఆకర్షిస్తున్న విదేశీ చెట్టు**

కడియం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం నర్సరీలకు ఇప్పటివరకు అనేక రకాల విదేశీ మొక్కలు దిగుమతి అయ్యాయి. అవి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు కూడా తీసుకొచ్చాయి. తాజాగా కడియపులంక శివాంజనేయ నర్సరీ రైతు మల్లు పోలరాజు కొద్ది రోజుల క్రితం వింత ఆకారాలతో తీసుకొచ్చిన చెట్లు ఆకట్టుకుంటున్నాయి. దక్షిణ అమెరికాలో విరివిగా ఉండే వీటిని స్పెయిన్, థాయిలాండ్ వంటి దేశాల్లో విక్రయిస్తున్నారు. పెద్ద పార్కులు, హోటళ్లు, గార్డెన్స్‌లో ప్రత్యేక అలంకరణగా వీటిని పెంచుతారు. వయసు 100 నుంచి 120 ఏళ్లు ఉంటుంది. ఒక్కో చెట్టు ఖరీదు రూ.35 నుంచి రూ.40 లక్షలు ఉంటుంది. ఈ చెట్లను భారీ కంటైనర్లలో తీసుకొచ్చారు. ప్రస్తుతం మోడుగా ఉన్న వీటికి కొమ్మలు వచ్చి రంగురంగుల పూలు పూస్తాయని పోలరాజు తెలిపారు. 'సిల్క్ ఫ్లోస్' ట్రీ'గా పిలువబడే ఈ చెట్టు శాస్త్రీయ నామం 'కొరిసియా స్పెసియోసా'. ఇవి కడియం నర్సరీలతో పాటు హైదరాబాద్ సమీపంలోని 150 ఎకరాల పార్కులో ఉన్నాయి.



# జేఎన్టీయూకే నూతన వీసీ బాధ్యతల స్వీకరణ

● ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు అభినందనలు తెలిపిన వర్సిటీ అధికారులు, తదితరులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతిగా నియామకమైన ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం వీసీ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, మాజీ ఉపకులపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ సమావేశపు హాల్లో రిజిస్ట్రార్, ఓఎస్డీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనను వీసీగా నియమించినందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని ఆపేరు ప్రఖ్యాతులను కాపాడుకుంటూ మరింత ఉన్నతస్థానానికి చేరుకునేలా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. పూర్వ విద్యార్థులు యూనివర్శిటీ అభివృద్ధికి తమవంతు సహకారమందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని 2047లో అభివృద్ధిపథంలో పయనింపజేసేలా చేపడుతున్న వికసిత్ భారత్, సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమైన స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధనకు కృషిచేస్తూ వర్శిటీ అభివృద్ధికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. జేఎన్టీయూకే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో ఉండేలాగా, మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకింగ్ సాధనకు కృషిచేద్దామన్నారు. అధ్యాపకులు ముఖ్యంగా



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీఎస్ ఆర్కే ప్రసాద్

పరిశోధనలకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అప్పుడే నాణ్యత కలిగిన పరిశోధనలు చేపట్టవచ్చని తెలిపారు. విద్యార్థులను స్టార్టప్స్, ఆవిష్కరణలు పట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతో పాటు ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకనుగుణంగా బోధన ఉండేలా ప్రణాళిక చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు డైరెక్టర్లు సాయిబాబు, రవీంద్ర, కృష్ణ, గోపాలకృష్ణ, బాలకృష్ణ, పద్మజారాణి, వెంకట రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణప్రసాద్, కుమారస్వామి ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాధ్యతలు స్వీకరించనున్న నన్నయ వర్సిటీ వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా ప్రభుత్వం నియమించిన ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రస్తుతం ఆంగ్లశాఖ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఉద్యోగ బాధ్యతలు చేపడతారు. ఈ సమాచారం అందుకున్న ఇక్కడి వర్సిటీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ అధికారులు, తదితరులు పాల్గొంటారు.

## పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలపై సీఎంకి వినతి



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటసుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర నష్టాలను ఎదుర్కొంటుండడంతో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు, కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు బుధవారం విలేకరులకు తెలిపారు. బర్డ్ ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, వేలాది కోళ్లు, లక్షలాది గుడ్లు కొనుగోలు లేక పాడైపోయి నష్టాలను చవిచూస్తున్నట్టు సీఎంకి వివరించామన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్టు వెంకటసుబ్బారావు చెప్పారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడును కలిశామన్నారు. ఈయనతోపాటు ఫెడరేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## మాయమాటలు చెప్పి ... మహిళలను మోసగించి

● ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మహిళలను మోసగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కే. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరుకు చెందిన బొజ్జా సింధూ, ఆమె బంధువు దుద్దుకూరుకి చెందిన మరో మహిళను ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రుణం ఇప్పిస్తానని చెప్పి నమ్మించారు. దీంతో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కడిమి శ్రీనుబాబు, మెరిపో కృష్ణ దఫదఫాలుగా రూ. 3,45,000 తీసుకున్నారు. ఈ నెల 13వ తేదీన సింధూ తన భర్తతో కలిసి ధర్మవరం వెళ్లి అడగ్గా, ఆ ఇద్దరు వ్యక్తులు దురుసుగా మాట్లాడి, కొట్టి చంపుతానని బెదిరించారు. దీనిపై కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# గోదాట్లో దూకేశాడా?

● యువకుడి అదృశ్యం .. ఆందోళనలో కుటుంబ సభ్యులు
● రోడ్డు కం రైలు వంతెనపై కనిపించిన సాయితేజ బైక్
● నదిలో గాలిస్తున్న బంధువులు



గగ్గురోతు సాయితేజ

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గురోతు సాయితేజ (25) కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సాయితేజ రాజమహేంద్రవరంలో ఓ గేదెల ఫాంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా నే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై మోటారు సైకిల్‌ను గుర్తించారు. సాయితేజ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, ఆచూకీ లభించకపోవడంతో గోదావరి నదిలో జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి వరకు ఆచూకీ తెలియరాలేదు. మోటారుసైకిల్ బ్రిడ్జిపై పెట్టి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడా, లేదా గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే సందేహం వ్యక్తమవుతోంది. అదృశ్యమైన యువకుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి కేసు నమోదు చేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

రాజానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 2వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందరాడ గ్రామానికి చెందిన దువ్వాటి సామ్యూల్‌రాజును చప్పిడి శివకాశి చాకుతో గాయపర్చి హత్యాయత్నం చేయడంపై అప్పటి ఎస్.ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాదాపు నాలుగేళ్ల తర్వాత కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సామ్యూల్‌రాజుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.ప్రకాష్‌బాబు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పీవీ వీఎస్‌బీ రాజు వాదించగా, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేషబుల్స్ దుర్గాప్రసాద్, వెంకటరమణ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారన్నారు.

# గామన్‌బ్రిడ్జిపై కారు దగ్ధం

●ఏసీలో తలెత్తిన షార్ట్‌సర్క్యూటే కారణం ● మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



బ్రిడ్జిపై కాలిపోతున్న కారు (ఇన్‌సెట్లో), మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గోపాలపురం మండలం వాదాలకుంటకి చెందిన బందెల కృష్ణారావు తన ఇండిగో కారులో సీతానగరం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి 33వ స్తంభం వద్దకు వచ్చేసరికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అందులో ఉన్నవారంతా దిగి బయటకు వచ్చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్‌అధికారి ఎస్. సీతారామయ్య తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. లక్ష ఆస్తినష్టం సంభవించిందన్నారు. ఈ ఘటనతో గామన్‌బ్రిడ్జిపై దొమ్మేరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే రోడ్డులో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. లీడింగ్ ఫైర్‌మేన్ పి. అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్ బి. పోసియ్య, ఫైర్‌మ్యాన్‌లు ఎం. రవికుమార్, కె.ధనుంజయ, హోంగార్డులు ఎం. శ్రీను, డేవిడ్‌రాజు, పోలీసు కానిస్టేబుల్ రాంబాబు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చారు.

# కోరంగి ఎకో 'మాస్టర్ ప్లాన్'కి సలహాలివ్వండి

● కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
● అటవీ, రెవెన్యూ, మత్స్య, తదితర శాఖల అధికారులతో సమావేశం

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోరంగి వైల్డ్ అభయారణ్యం ఎకో సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారీకి సంబంధిత అధికారులు సూచనలు, సలహాలు అందించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్‌లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై అటవీ, రెవెన్యూ, మత్స్య,ఉద్యాన, తదితర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభయా రణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాల్లో 26 కిలోమీటర్ల దూరం వరకు ఎకో- సెన్సిటివ్ జోన్ ఉంటుందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మనుగడకు మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

నెలకొని పచ్చదనం పెంపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వ చేసుకుని జంతువులకు నీటిసమస్య లేకుండా చేయవచ్చునన్నారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్, డెవలప్‌మెంట్ వారు ఎకో- సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారు చేయనున్నారన్నారు. తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరా న్మెంట్, డెవలప్ మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ వినోద్, హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ జయచంద్ర, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, మత్స్యశాఖ అధికారి కరుణాకర్ బాబు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, కాకినాడ అటవీ అధికారి శ్రీదీప్తి, కోరంగి వైల్డ్‌లైఫ్ అటవీ అధికారి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలికను మాయచేసి ఆమెపై అత్యాచారంచేసిన కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్టు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అనాతవరం గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ (బులిచంటి)(30) ఓ పాఠశాలలో చదువుతున్న బాలికను సోమవారం బలవంతంగా మోటారు సైకిల్ ఎక్కించుకుని అమలాపురం తీసుకువెళ్లి ఎర్రవంతెన సమీపంలో ఉన్న ఓ నివాస గృహంలో ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక పాఠశాలకు హాజరుకాకపోవడం, ఆ బాలిక కూడా ఉన్న విద్యార్థినులు మోటారుసైకిల్‌పై వ్యక్తి బలవంతంగా తీసుకువెళ్లినట్టు పాఠశాల హెచ్‌ఎంకు తెలపడంతో హెచ్‌ఎం ఆ విషయాన్ని బాలిక తండ్రికి ఫోన్‌చేసి తెలిపారు. దీంతో ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ విషయం దుర్గాప్రసాద్‌కు తెలియడంతో ఆ బాలికను అమలాపురంలో బస్‌చార్జీలకు డబ్బులిచ్చి బస్ ఎక్కించి పంపించి వేశాడు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌లు కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. నిందితుడిపై పోక్సో అత్యాచారం కేసులు నమోదుచేసి ముమ్మిడివరం జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ రహ్మతుల్లా నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

## గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● రూ.3.60లక్షలు విలువైన ఎరువులు సీజ్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన పట్టణంలోని మన గ్రోమోర్ రిటైల్ సెంటర్‌లో విజిలెన్స్ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. 14-35-14 రకం కాంప్లెక్స్ ఎరువు 200 బస్తాలకు సంబంధించి ఇన్వాయిస్‌లు లేకపోవడం, రైతులు ఫిర్యాదు చేసేందుకు కంప్లయింట్ బుక్ లేకపోవడం, స్టాక్ బోర్డు మెయిన్‌టెయిన్ చేయకపోవడంతో 6(ఏ) కేసు నమోదు చేశారు. రూ.3.60లక్షలు విలువయిన కాంప్లెక్సు ఎరువులను సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, సీఐ నాగవెంకటరాజు, ఏవో మధుమోహన్, తూనికలు, కొలతలు శాఖ అధికారి సరోజిని, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తునిలో దొంగల బీభత్సం

● ఎనిమిది షాపుల్లో చోరీ
● షట్టర్లు పగులగొట్టి దుండగుల దోపిడీ






చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు, షాపు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడుతుండగా రికార్డు అయిన దృశ్యం

తునిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు బీభత్సం సృష్టించారు. తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మారడంతో, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లలో తలమునకలవ్వగా సందట్లో సడేమియా అన్న చందాన దోపిడీ దొంగలు దొరికినకాడికి దోచుకుపోయారు. తాజాగా తునిలో జరిగిన చోరీతో పట్టణవాసులు ఉలిక్కిపాటుకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 3నుంచి 4 గంటల ప్రాంతంలో పట్టణశివారు రైల్వే అండర్ పాస్ సమీపంలో వరుసషాపుల్లో షట్టర్లు పగలగొట్టి దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. దొంగతనానికి గుంపుగా ప్రవేశించిన వీరు దర్జాగా చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలకి చిక్కాయి. ఈ వీడియోలు సోషల్‌మీడియా వేదికగా వైరల్ కావడంతో పోలీస్ పెట్రోలింగ్‌పై విమర్శలు తలెత్తుతున్నాయి. పట్టణంలో పోలీసింగ్ కట్టుదిట్టంగా లేకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. దొంగలను త్వరితగతిన పట్టుకుని ఇటువంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని షాపుల యజమానులు కోరుతున్నారు. ఈ చోరీలో రెండు, మూడు షాపుల్లో నగదు భద్రపరుచుకునే సొరుగులు బద్దలగొట్టి నగదు చోరీ చేసినట్టుగా షాప్ యజమానులు వాపోతున్నారు. షాపు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదులతో తుని పట్టణ పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు.

## మండపేట, మారేడుబాక దేవాలయాల్లో హుండీల చోరీ

మండపేట, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. దేవాలయాల్లో హుండీలే లక్ష్యంగా ఎక కాలంలో మూడు దేవాలయాల్లో హుండీలను బద్దలు గొట్టి దోచుకుపోయారు. పట్టణంలో రథంగుడిసెంటరులోవున్న అంజనేయస్వామివారి భారీ విగ్రహం వద్దవున్న హుండీని దొంగలు బద్దలుగొట్టి అందులో వున్న నగదును దోచుకుపోయాడు. ఈ సంఘటన స్థానిక సీసీ ఫుటేజ్‌లో నమోదైంది. బుధవారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో చోరీ జరిగినట్టు నమోదైంది. ఈ చోరీ చేసిన వ్యక్తి మంకీ క్యాప్ ధరించి టూవీలర్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్టుగా సీసీ ఫుటేజీలో నమోదైందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఆ హుండీలలో రూ.20వేలకుపైగా నగదు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇదే అంశంపై ఆలయ నిర్వాహకులు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశారు. పట్టణ సీ.ఐ డి.సురేష్ సంఘటనా స్థలానికి సిబ్బంది వచ్చి ఆరా తీశారు. మండలంలోని మారేడుబాకలో వున్న వినాయకుడుగుడి, రామాలయంలో దొంగలుపడి హుండీల్లో నగదును దోచుకుపోయారని ఆలయాల నిర్వాహకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేరోజు మూడుచోట్ల వేర్వేరుగా చోరీలు జరగటం ప్రజల్లో ఆందోళన కలుగుతుంది. గంజాయికి అలవాటుపడిన వ్యక్తులే ఈతరహా చోరీలకు పాల్పడ వచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మండపేట ఆంజనేయస్వామి హుండీ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పట్టణ సీఐ సురేష్

## చికిత్సపొందుతూ తల్లి, కుమారుడు మృతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో ప్రమాదవశాత్తూ పెట్రోల్ మంటలు చేలరేగి నిప్పు అంటుకుని తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తల్లి, కుమారుడు మృతి చెందారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. లొల్ల గ్రామానికి చెందిన చి ట్టూరి లక్ష్మీకాంతం(54), ఈనెల 14న రాత్రి 9గంటల సమయంలో తన కిరాణాషాపులో ఉన్న పెట్రోలు కింద ప డి మంటలు ఏర్పడటంతో ఆమె తీవ్రంగా గాయపడగా, అదే సమయంలో అక్కడే ఉన్న పెద్దకుమారుడు సాయికృష్ణ మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా గాయపడ్డాడు. ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. మంగళవారంరాత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ లక్ష్మీకాంతం మృతి చెందారు. సాయికృష్ణ పరిస్థితి విషమంగా మారడంతో బుధవారంరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.



# మోటారు సైకిళ్ల డిక్కీలే లక్ష్యంగా..

● చోరీలకు పాల్పడుతున్న ముఠాలో వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల డిక్కీలనే లక్ష్యంగా చేసుకుని నగదు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలో ఒక వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డిక్కీ ఉన్న మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని సంబంధిత యజమానులు తిరిగే ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహిస్తూ చాకచక్యంగా పట్టపగలే డిక్కీలను తెరిచి చోరీలకు పాల్పడుతూ మోటారు సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు పరారవుతున్నట్టు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఈనెల 4న పేరూరు భారత్ పెట్రోలు బంకు సమీపంలో టిఫిన్ సెంటర్‌వద్ద మోటారు సైకిల్ పెట్టి అల్పాహారం చేసేందుకు వెళ్లారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు డిక్కీని తెలిపి అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని మోటారు సైకిల్‌పై పరారయ్యారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో ఒక నిందితుడిగా ఉన్న విజయనగరంజిల్లా కొత్తవలస మండలం చీడివలస పంచాయతీకి చెందిన మేకల బాలరాజు(33)ను బుధవారం అరెస్టుచేసి అతనివద్ద నుంచి మూడు కేసుల్లో రూ.1.77లక్షల నగదుతోపాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలరాజుపై రావులపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో రెండు కేసులు ఉన్నాయి. ముఠాలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, వీరు ఇరువురు విజయనగరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడగా పలు పోలీసుస్టేషన్లలో వీరిపై కేసు నమోదై ఉన్నాయి. బాలరాజును అమలాపురం ఏజీఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపించామన్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ పి.వీరబాబు, ఎస్ఐ టి.తిరుమలరావు దర్యాప్తుచేశారు. ఇద్దరు నిందితులపై తెలంగాణలో పలు కేసులు నమోదయ్యాయి.

## కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన చల్లా సత్యనారాయణ

గండేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో నీలాద్రిరావుపేట జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన చల్లా సత్యనారాయణ(35) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం సత్యనారాయణ రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేటవైపు మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో వెళుతుండగా నీలాద్రిరావుపేట గ్రామం వచ్చేసరికి వెనుక వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితుడు దుర్గారావుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ను నియంత్రించి సత్యనారాయణ మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంకు తరలించి కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటిని పోషించే వ్యక్తి మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని కుటుంబీకులు రోధిస్తున్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):ఈనెల 21న కాకినాడ డీ4సెక్షన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని కాకినాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. రాజీవ్‌గాంధీ కళాశాల ఏరియా, ఐశ్వర్యనగర్, బాపన్న దొరకాలనీ, ఈశ్వర్‌నగర్, బాలాజీనగర్, అవంతినగర్, మారుతీనగర్, ఆంజనేయనగర్‌ల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తారు.

## సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం



పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్మోహన్

- వీఐపీ దర్శనాలు నిర్దిష్ట సమయంలోనే
- ఇక్కడకు వచ్చి గొడవ చేస్తే క్రిమినల్ కేసులు
- పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

పిఠాపురం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాల్లో సామాన్య భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యమని జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ స్పష్టం చేశారు. వీఐపీల దర్శనాల కోసం ప్రత్యేక సమయాలు కేటాయిస్తామని, వారు ఆ సమయంలోనే రావాలని సూచించారు. ప్రత్యేక దర్శనాలు, ఇతరత్రా విషయాలపై ఆలయం వద్దకు వచ్చి గొడవచేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఒకరిద్దరు బాధపడినా సామాన్యులు ఇబ్బంది పడకూడదన్నది తమ ఉద్దేశమని, దీనిని అందరూ అర్థం చేసుకోవాలని కోరారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ఆర్డీవో మల్లిబాబులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. లక్షమందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు ఎలా ఏర్పాటు చేయాలని, భక్తులను ఎలా నియంత్రించాలి, హైవేలో ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ఒక ప్రణాళిక తయారు చేసినట్లు వివరించారు. వీఐపీలు, ప్రోటోకాల్ ఏ సమయంలో దర్శనాలకు రావాలి, ఎవరిని సంప్రదించాలి, ఏ గేటు నుంచి రావాలి తదితర విషయాలను 24న తెలియజేస్తామని తెలిపారు. దీనిని అందరూ పాటించాలని సూచించారు. ఇటీవల రెండు, మూడు నెలల వ్యవధిలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పాదగయకు ఉన్న విశిష్టత, వచ్చే భక్తుల సంఖ్యపై అంచనా ఉందని, దానికి అనుగుణంగానే ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, దానిని కూడా దృష్టిలో ఉంచుకుని అధికారయంత్రాంగం వ్యవహరిస్తుందని తెలిపారు. ఎవ్వరికి వీఐపీ పాస్‌లు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. పుష్కరిణివద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని సూచించారు. అన్నిశాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి భక్తులకు సులభరీతిలో దర్శనాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. సమీక్షలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్‌కుమార్, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ కనకారావు పాల్గొన్నారు.

## మునిసిపల్ పాఠశాలలో వార్డు సచివాలయం



పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవనంలో ఏర్పాటుచేసిన వార్డు సచివాలయం

- హైకోర్టు ఆదేశాలు పట్టని అధికారులు
- గతంలో కోర్టు ధిక్కార నోటీసులు

పాఠశాలల్లో ఎటువంటి ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు ఉండకూడదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా పిఠాపురం మునిసిపల్ అధికారులకు పట్టలేదు. మునిసిపల్ అతిథి గృహంలో ఉన్న వార్డు సచివాలయాన్ని ఖాళీచేసి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేశారు. హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది.

పిఠాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ఆవరణలో ఎటువంటి ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు ఉండకూడదు. ఉన్నా వాటిని తక్షణం ఖాళీ చేయాలంటూ హైకోర్టు ఆదేశాలు ఇవ్వడమే కాదు. తమ ఉత్తర్వులను పాటించడం లేదంటూ పలువురు ఉన్నతాధికారులకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. దీంతో ఆగమేఘాలపై అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను మూడేళ్ల కిందట ఖాళీ చేయించారు. ఆఖరుకు పాతబస్టాండు రాజీవ్‌గాంధీ మునిసిపల్ ఉన్నతపాఠశాల ఆవరణలో ఉన్న ఎంఈవో కార్యాలయాన్ని సైతం ఖాళీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా కార్యాలయాలు కొనసాగుతుండటంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసి సంబంధిత శాఖల కార్యదర్శులను తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. హైకోర్టు ఇంత సీరియస్‌గా ఆదేశాలు ఇస్తే పిఠాపురం మునిసిపల్ అధికారులకు మాత్రం పట్టలేదు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పాఠశాల ఆవరణలోని భవనాల్లో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. తమకు హైకోర్టు ఆదేశాలు వర్తించవని వారు భావించినట్లున్నారు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### అక్కడ ఖాళీ చేసి ఇక్కడ

పిఠాపురంలో పాడా కార్యాలయం ఏర్పాటు కోసం ఇప్పటివరకూ పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ అతిథిగృహాన్ని ఎంపిక చేశారు. దీంతో ఇప్పటివరకూ అక్కడ కొనసాగుతున్న వార్డు సచివాలయం-7ను అక్కడి నుంచి ఖాళీచేసి అన్నక్యాంటీన్ పక్కనే ఉన్న ఓటీఎస్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవనాల్లో ఈ సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. గతంలో ఇక్కడ ఉన్న శాఖా గ్రంథాలయాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు ఖాళీ చేయించిన మునిసిపల్ అధికారులే ఇప్పుడు ఇక్కడ వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేయడం విస్మయం కలిగిస్తోంది హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఇక్కడ వార్డు సచివాలయం ఏర్పాటుకు మునిసిపల్ అధికారులు ఎలా అనుమతించారని పలువురు ప్రశ్నిస్తున్నారు.




అన్నక్యాంటీన్ పక్కన ఉన్న స్కూలు భవనంలోకి సచివాలయం మార్చినట్లు ఏర్పాటుచేసిన బోర్డు

## రేపు పెన్షన్ అదాలత్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న పెన్షన్ అదాలత్‌ను కాకినాడలో జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. తొలుత కలెక్టరేట్‌లో నిర్వహించాలని నిర్ణయించామని వేదిక మార్చామన్నారు. జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఉదయం 10గంటల నుంచి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ ప్రారంభమవుతుందన్నారు.

## నేడు పీఆర్ ప్రిన్సిపాల్‌పై విచారణ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం కళాశాలలో కమిటీ విచారణ చేపట్టనుంది. కళాశాలకు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు ఈ కళాశాల నిధులతో పాటూ పరీక్షల విభాగంలో కూడా నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాశాఖ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి విచారణ చేపట్టారు. గత ఏడాది నవంబరు 14న ఆర్జేడీ శోభారాణి ఆధ్వర్యంలో కమిటీ విచారణచేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దానికి సంతృప్తి చెందకపోవడంతో తిరిగి మళ్లీ విచారణను చేపట్టనున్నారు.

## కొడవలిలో కోడిపందాలపై దాడి

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలిలో కోడిపందాలు ఆడుతున్న వారిపై ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం దాడిచేశారు. నలుగురిని అరెస్టుచేసి రూ. 9,050 నగదు, రెండుకోళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.







గొల్లప్రోలు: చేబ్రోలులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందు, వర్మ



కరపలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ



సామర్లకోట: వేట్లపాలెంలో ఎన్నికల ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

## కూటమి అభ్యర్థికి అండగా నిలవండి

- మాజీ ఎమ్మెల్యేలు వర్మ, గోవిందు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలిచి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మలు కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రవేటు స్కూలు, కళాశాలల టీచర్లను, పట్టభద్రుల ఓటర్లను వారు బుధవారం సాయంత్రం కలిసి కూటమి అభ్యర్థికి ఓటువేయాలని అభ్యర్థించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

**పిఠాపురం:** కూటమి ఎమ్మె ల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, పట్టణ అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు ఓలేటి వెంకటేశ్వరరావు, కంబాల నాగేశ్వరరావు, నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్తిబాబు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఓటుహక్కును వినియోగించుకోండి: ఎమ్మెల్యే నానాజీ

**కరప**: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విజ్ఞప్తి చేశారు. కరప, గురజానపల్లి, అరట్లకట్ట గ్రామాల్లో బుధవారం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం పలువురు గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలను అందజేసి పేరాబత్తులకు ఓటేయాలని విజ్ఞప్తిచేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఈ ఎన్నికల ప్రచారంలో కాకినాడరూరల్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సీతంరాజు సుధాకర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నేతలు వీవైై దాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, రంబాల వెంకటేశ్వరరావు, పబ్బినీడి వెంకటకృష్ణ, కర్నాసుల పుష్పరాజు, దేవు వెంకన్న, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, బోగిరెడ్డి గంగాధర్, జోకా అప్పలరాజు(తాతాజీ), జిల్లెల ప్రసాద్, యాళ్ల పండు, వెలుగుబంట్ల శ్రీనివాస్, కంటే సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చినరాజప్ప ప్రచారం

**సామర్లకోట:** రానున్న ఉభయగోదావరిజిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటునువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పేర్కొన్నారు. బుధవారం సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, స్థానిక టీడీపీ నాయకులు గుమ్మెళ్ళ రామకృష్ణ తదితరులతో కలిసి గ్రామంలో పలువురు గ్రాడ్యుయేట్ల ఓటర్లను కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ ప్రచారంలో అమటం వెంకటేశ్వర రావు, రామకృష్ణ, చిల్లి మోహనరావు, నవీన్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలి

**తాళ్లరేవు:** పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు జి.వేమవరం, పటవల గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ చిక్కాల గ్రామాల్లో తిరుగుతూ పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమినేతలు ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, పుణ్యమంతుల సూరిబాబు, సత్తిబాబు, కొమ్మోజు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



కొత్తపల్లిలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన ఛత్రపతి శివాజీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ కొత్తపల్లి మండల నాయకులు కొనియాడారు. మహారాజ్ ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కొత్తపల్లిలో ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవణం సుబ్రహ్మణ్యం, మేడసాని వరలక్ష్మీనారాయణ, పంపన శేష, గౌరి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**సర్పవరం జంక్షన్:** స్థానిక నాగమల్లితోట జంక్షన్ శ్రీసత్య దంత వైద్యశాల్లో కాకినాడ ఐడీఏ సభ్యుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ భారతీయుడు గౌరవంతో ప్రతిధ్వనించే పేరు శివాజీ సొంతమన్నారు. కార్యక్రమంలో ఐడీఏ సభ్యులు డాక్టర్ సాయి కార్తీక్, డాక్టర్ స్వరూప్, డాక్టర్ శ్రీవల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

### పిఠాపురంలో శోభాయాత్ర

**పిఠాపురం:** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పిఠాపురం పట్టణంలో బుధవారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. పురవీధుల్లో ర్యాలీ సాగింది. శివాజీ, భవానీమాత కాషాయ జెండాలు, ఛత్రపతి శివాజీ విగ్రహంతో జీపులో ముందుండి ర్యాలీని నడిపించారు. ర్యాలీలో వీహెచ్‌పీ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరావు, బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూధర్నా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్థకశాఖలో పశుసంచార వాహనాలపై పనిచేసే సిబ్బందిని తొలగిస్తున్నట్లు ఆదేశాలు ఇవ్వడం దారుణ మని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషు బాబ్జి, సీఐటీయూ జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయు అధ్యక్షులు, కోశాధికారి మాట్లాడుతూ పశుసంవర్థక శాఖలో పశుసంచార వాహనాలు కాకినాడ జిల్లాలో 14 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనా లలో డ్రైవర్లు, ఫార్మసిస్టులు, డాక్టర్లు పని చేస్తున్నారన్నారు. వీరందరినీ తొల గిస్తున్నట్లు వారికి వాట్సాప్‌లో మెస్సేజ్ పంపి నిలుపుదల చేశారన్నారు. ఈ నిలుపుదల ఆదేశాలను వెంట నే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ వాహనాలపై పనిచేసే సిబ్బందికి రెండునెలల నుంచి వేతనాలు బకాయి ఉన్నాయని బకాయి జీతా లను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ బకాయి జీతాలు చెల్లింపు కోసం తక్షణమే ప్ర భుత్వంతో మాట్లాడతామని, వీరిని విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామ న్నారు. సత్యనారాయణ, మల్లిక, శ్రీను, రమణ, ప్రసాద్, సుమన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేస్తున్న పశుసంవర్థకశాఖ ఉద్యోగులు

## ఘనంగా ముసాలమ్మతల్లి తీర్థం



ముసాలమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కన్నబాబు

కరప, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములవాడ, వలసపాకల గ్రామాల గ్రామదేవత ముసాలమ్మతల్లి అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. వేములవాడలోని పచ్చని పంటపొలాల మధ్య ఉన్న అమ్మవారిని ఉదయం నుంచి భక్తజనం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండేళ్లకోసారి ఈ అమ్మవారి జాతర మహోత్సవం జరుగుతుందని గ్రామపెద్దలు తెలిపారు. నెలరోజుల క్రితమే ఊరి పొలిమేరలోని అమ్మ వారి ప్రతిరూపాలుగా కొలిచే పరగంగలను తీసుకువచ్చి గ్రామం నడిబొడ్డున ఏర్పాటుచేసిన ప్రత్యేక పాకలో ప్రతిష్ఠింపజేశారు. అప్పటినుంచి రోజూ అమ్మవారి గరగలను ఊరిలో తిప్పుతూ పాన్పులు పరుస్తూ గ్రామోత్సవం చేశారు. చివరి మూడురోజులు జరిగే జాతర మహోత్సవంలో భాగంగా తొలిరోజు సోమవారంరాత్రి అమ్మవారి జాగారాన్ని గ్రామస్తులు ఘనంగా జరిపారు. రెండోరోజు మంగళవారం పరగంగలను ఊరి పొలిమేర పంపి ంచారు. చివరి రోజు బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించి గుడికి తరలించి భక్తిశ్రద్ధలతో సంబరం జరిపారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నిప్పులగుండాన్ని పలువురు భక్తులు తొక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు పంతం నా నాజీ, దాట్ల బుచ్చిబాబు, మాజీమంత్రి, వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, సర్పంచ్‌లు కమిడి మంగాదేవి భీమశంకర్, వాసంశెట్టి రామారావు, బండే తాతాజీ, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రాథమిక అభ్యాసాన్ని తీర్చిదిద్దేందుకే 'జ్ఞానజ్యోతి'

సామర్లకోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను మరింత తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలో జ్ఞానజ్యోతి పేరిట సామర్లకోట, ఉండూరులలో నిర్వహిస్తున్న శిక్షణాతరగతులు రెండోరోజైన బుధవారం కొనసాగాయి. ప్రభుత్వ లక్ష్యసాధనలో భాగంగా శిక్షణ పొందిన అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషిచేయాలని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషాలు పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణాతరగతులలో భాగంగా సామాజిక అభివృద్ధి, భాషాభివృద్ధి, తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. టీచింగ్ లెర్నింగ్ అంశాలతో అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించిన పలు ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. రెవెన్యూ ఇంచార్జిగా తోటకూర సాయిరామకృష్ణ ప్రసంగించారు. అనంతరం ఎస్‌పీఎల్ సహా యంచాలకులు భాస్కరరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి యోగా, ధ్యానంలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎండీ సుల్తానాబీబీ, మంగ, నిర్మలాకు మారి, చంద్రకళ, ఉమాదేవి పాల్గొన్నారు.

### చదువు మీద ఆశకి కలిగించేలా చూడాలి

కరప, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పిల్లలకు చదువుపట్ల ఆశక్తి కలిగించేలా ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో కొప్పుల బులి కృష్ణవేణి సూచించారు. కరప మండలం వేములవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు మంగళవారం నుంచి జరుగుతున్న ఆరురోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎర్లీ చైల్డ్‌ఉడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (పిల్లల సంరక్షణ మరియు విద్య)లో భాగంగా మూడేళ్లలో 120 రోజులపాటు ఈ జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండోరోజు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి సమగ్రశిక్ష అబ్జర్వర్ ఏఎల్ఎస్‌సీ కో-ఆర్డినేటర్ హరికృష్ణ విచ్చేసి పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో యాసరపు లక్ష్మి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, రీసోర్స్‌పర్సన్‌లు వై.శ్రీనివాస్, ఎన్.విష్ణు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ, సీఆర్‌పీలు వి.సత్యనారాయణ, పలక రాజు పాల్గొన్నారు.

### పీబీసీ కాలువపై ఆక్రమణలు తొలగింపు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం మాధవపురం గ్రామంలో పీబీసీ కాలువపై ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు మధ్య బుధవారం తొలగించారు. ఇటుక బట్టీ వ్యాపారం నిర్వహించుకునే వీరబాబు కాలువపై సుమారు 25 సెంట్లు ఆక్రమించి షెడ్లు వేశారు. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు ఆరు నెలల క్రితమే ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ తొలగించకపోవడం తో బుధవారం పోలీసు బందోబస్తు మధ్య షెడ్లను కూ ల్చివేశారు. తొలగింపును పీబీసీ ఏఈఈ శివరామకృష్ణ పర్యవేక్షించారు.

### ఉచిత కంటి పరీక్ష శిబిరం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగస్తులు, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, సెక్రటేరియట్ ఉద్యోగులు, సిబ్బందికి బాల భవన్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద బుధవారం ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు తక్కువ ధరకు అందజేశారు. శిబిరాన్ని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ భావన కూడా కంటి పరీక్ష చేయించుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డి.పృధ్వీచరణ్, సతీష్, త్రినాద్ పాల్గొన్నారు.

### గత ఐదేళ్ల పాలనలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): గతఐదేళ్ల పాలనలో ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు పేర్కొన్నారు. బుధవారం కాకినాడ నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వల్లభనేని వంశీ అరెస్టును మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తప్పుపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బంగారు సత్యనారాయణ, బచ్చల కామేశ్వరరావు, బాలప్రకాశ్ పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో పరిశీలన

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామంలో శిథిల వంతెన మీదుగా చినబ్రహ్మదేవం గ్రామంలో కేబీకే పరిశ్రమకు చెందిన భారీ లారీలు రాకపోకలను నిరోధించాలని గత రెండు రోజులుగా గ్రామస్తులు చేస్తున్న ఆందోళనల మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌కు బుధవారం గ్రామస్తులు అందించిన ఫిర్యాదుతో అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ఆదే శాల మేరకు బుధవారంరాత్రి పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి తదితర రెవెన్యూ అధికారులతో కలిసి రాయభూపాలపట్నం గ్రామానికి చేరుకుని గ్రామస్తులు చేస్తున్న ఆందోళనలో భాగమైన శిథిల వంతెన ను ఆర్డీవో పరిశీలించారు. గ్రామస్తుల వినతుల మేరకు శిథిలవంతెన స్థానంలో కొత్తగా వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీరమణి ఎదుట స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసి తదుపరి చర్యలు తీసుకోను న్నట్లు ఆర్డీవో శ్రీరమణి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకట లక్ష్మి, వీఆర్వో వాకపూడి శ్రీను తదితర గ్రా మస్తులు మన్యం ప్రసన్న, పెనుమర్తి దొరబాబు, నల్లల శ్రీను, కల్తూరి శ్రీను, సుధీర్, నవీన్, సానిపి ని సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కరప, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కరపలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప గ్రామానికి చెందిన శివకోటి బాలరాజు స్థానిక స్వర్ణ థియేటర్ వద్ద మద్యం సేవించి కిందపడిపోయాడు. అదే సమయంలో కాకినాడవైపు వెళ్తున్న లారీ వెనుక చక్రం బాలరాజు ఎడమచేతి పైనుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో చెయ్యి నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

**హైస్కూల్ పనులు త్వరగా పూర్తి చేయండి**

కోటనందూరు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సర్వశిక్షాభియాన్ ఏఈ వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం కోటనందూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 10 హైస్కూల్లో భవనాలు పనులు నత్తనడకన ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంఈవోలు శ్రీనివాస్, రామశేఖర్, డీఈ మోహన్, సీఆర్పీ యర్ర శేఖర్ పాల్గొన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## ముంపు ఇళ్ల విలువలపై రీ సర్వే చేయిస్తాం

**పరిహారం చెల్లింపుల్లో గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటాం: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్**



చింతూరు ఐటీడీఏలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం చెల్లింపుల్లో ఎటువంటి అనుమానాలు, అపోహలు వద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన చింతూరు, కూనవరం మండలాల్లో పర్యటించారు. చింతూరు ఐటీడీఏలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను విన్నవించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ చింతూరులో ముంపునకు గురికానున్న ఇంటి విలువల లెక్కింపుపై పలు అభ్యంతర రాలు వచ్చాయన్నారు. లెక్కింపు సక్రమంగా లేవన్న ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. వాటన్నిటినీ రీ సర్వే చేయిస్తామన్నారు. గ్రామం మొత్తం ఒక యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లింపులు జరుగుతాయన్నారు. అభ్యంతరాలు ఉన్న ఇళ్లకు ఆలస్యంగా, అభ్యంతరాలు లేని ఇళ్లకు పరిహారం చెల్లింపు ముందుగా చెల్లించడం ఆనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. అటువంటి ప్రచారాలను నిర్వాసితులు నమ్మవద్దన్నారు. ఇకపై ముంపు గ్రామాల వారీగా పోలవరం ప్రత్యేక అధికారులు పర్యటించి నిర్వాసితుల నుంచి వినతులు తీసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గిరిజన నిర్వాసితులకు ఇచ్చే భూమికి భూమి అంశంపై సర్వే మొదలుపెడతామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా యూనిట్ల వారీగా కమిటీలు వేస్తామన్నారు. నిర్వాసితుల సమస్యలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలనా అధికారి వి.అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టుకల్లా నిర్వాసితుల కాలనీల్లో వసతులు కల్పిస్తాం



పోలవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కూనవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల కాలనీల్లో ఈ ఏడాది ఆగస్టుకల్లా అన్ని వసతులు కల్పిస్తామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. వీఆర్ పురం మండలం జిడిగుప్ప నిర్వాసితులకు భైరవపట్నంలో నిర్మించిన పోలవరం నిర్వాసితుల కాలనీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో సమావేశమయ్యారు. మొత్తం 159 ఇళ్లకు 75 మాత్రమే పూర్తయ్యాయి. కాలనీలో ఎందుకు ఉండట్లేదని ప్రశ్నించారు. తాగునీరు, పాఠశాల భవనాలు సదుపాయాలు లేకే తాము కాలనీకి రాలేకపోయామని నిర్వాసితులు తెలిపారు. తక్షణం అధికారులతో మాట్లాడి ఆగస్టునాటికి నిర్వాసిత కాలనీల్లో అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. నిర్వాసితుల పెన్షన్లు, రేషన్‌కార్డులు కూనవరం మండలానికి మార్చాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా తమకు భద్రాచలం ఐటీడీఏ భూములు కేటాయించిందని, వాటికి పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆ భూములకు పరిహారం ఇవ్వడం కుదరదని, భూమికి భూమి మాత్రమే ఇస్తామన్నారు. 17మందికి రావాల్సిన భూమిని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్వాసితులకు నచ్చిన భూమినే కొనుగోలు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తమ గ్రామంలో ఉన్నారని, వారికి పరిహారం ఇవ్వాలని గిరిజనులు కోరారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు. రాబోయే మూడు నెలల్లో ఈ ప్రాంతంలో గోదావరికి నీరు వచ్చే అవకాశముందన్నారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకునేందుకు, రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కోతుల గుట్ట నుంచి ఏడుగుర్లపల్లి మీదుగా భద్రాచలానికి రహదారి నిర్మించాలని కోరారు. ఈ రోడ్డుకు గతంలో తాను అనుమతి ఇచ్చామని, వరదల నాటికి పూర్తిచేయాలని అటవీ శాఖాధికారులతో మాట్లాడానన్నారు. రహదారి ఆదివాసి మార్గంలో ఉండడంతో అటవీ శాఖాధికారులతో మాట్లాడి అనుమతులు వచ్చేలా చూసి తక్షణం రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఎవీఆర్ కయశార్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యాలయాలకు పక్కా వసతులు

రంపచోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యాలయాలకు పక్కా వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన చింతూరు పర్యటనకు వెళ్తూ రంపచోడవరం మండలం పెద గెద్దాడలోని ఏకలవ్య పాఠశాలలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఉన్నారు.

### ఆత్మహత్యాయత్న నిర్వాసితుడి పునరావాసంపై

# నివేదిక సమర్పించండి

**అల్లూరి కలెక్టర్‌కు, జలవనరుల కార్యదర్శికి మరో అవకాశమిచ్చిన హక్కుల కమిషన్**

దేవీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కింద పునరావాసాన్ని, పరిహారాన్ని కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఓ వయో వృద్ధ నిర్వాసితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఏమిది వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిని ఆదేశించింది. గత సంవత్సరం మేలో దేవీపట్నం మండలానికి చెందిన ఉండముట్ల సీతారామయ్య ఫెర్రిశెట్టి రంలోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయమై రంపచోడవరం న్యాయవాది ఒకరు చేసిన ఫిర్యాదును కమిషన్ బుధవారం విచారించింది. సదరు ఘటన, పునరావాసం, పరిహారం కల్పించే చర్యలపై అల్లూరి కలెక్టర్, జల వనరుల శాఖ కార్యదర్శి సమగ్ర నివేదికలు సమర్పించలేదు. దీంతో నివేదిక సమర్పణకు ఆఖరి అవకాశాన్ని ఇస్తూ 8 వారాల్లోగా నివేదిక సమర్పించాలని, లేని పక్షంలో కమిషన్ తనకు ఉన్న అధికారాల మేరకు కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంటూ ఈ మేరకు ఇద్దరికీ ఆదేశాలిచ్చింది.

## బాలుడి వైద్యానికి రూ.లక్ష సాయం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనూరు వారి వీధి జీపీఎస్ పాఠశాలలో సీఆర్టీగా పనిచేస్తున్న తలారి రేవతి 14 నెలల బాబు మెదడువాపు వ్యాధితో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. వ్యాధి నయం కావాలంటే రూ.15లక్షలు అవుతుందని తెలిపారు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఐటీడీ శాఖ్టు పెట్టి రూ.6లక్షలు కట్టారు. మిగతా డబ్బులు ఎలా కట్టాలో తెలియని దయనీయ స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఆర్టీ సతీష్ మండలంలోని ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువుల ద్వారా రూ.లక్ష సమీకరించి బాబు కుటుంబానికి అందజేశారు.

## మహా శివరాత్రి ఉత్సవాలకు ధ్వజారోహణ

రంపచోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంప శివాలయంలో అర్చకుడు గొడవర్తి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ధ్వజారోహణం జరిపారు. మహా శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ సంయోజక్ గుడ్ల అంకిరెడ్డినారెడ్డి, విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిషోర్, సత్యంగ్ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామరెడ్డి, మండల కోశాధికారి గుప్తా, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

చింతూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొర్లగూడెంలో మడకం రామ్మార్తి ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న చింతూరు శ్రీభాస్కర విద్యానికేతన్ యాజమాన్యం బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించింది. రూ.29వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం, దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

**పలు చోట్ల ఎన్నికల ప్రచారం**



జగ్గంపేట: మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు



ప్రత్తిపాడు: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జగ్గంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో బుధవారం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్ అప్పలరాజు, రాయవరం శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో ఎన్నికల ప్రచారం**

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. బుధవారం పలు గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ మెట్ల రమణబాబు, మరో పరిశీలకుడు గంటా నూకరాజులు ఓటర్లను కలిసి అభ్యర్థించారు. ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, నర్సంపేట మంతెన శ్రీను, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులతో పాటు ఉపసర్పంచ్ అభిషిక్త క మిటీ సభ్యులు వెలుగుల నాని, బొల్లు వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు సింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి**

రౌతులపూడి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. రాఘవరం, శృంగవరం, బంగారయ్యపేట, ఎమ్. చామవరం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యనారాయణ, సింహాద్రి పెదబాబు పాల్గొన్నారు.

**ఇంటింటా ప్రచారం**

కోటనందూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం కూటమి అభ్యర్థులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బొర్సిచి చిరంజీవులు అన్నారు. బుధవారం జగన్నాథపురం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంట్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**పేరవరంలో ప్రచారం**

ఏలేశ్వరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు గంటా నూకరాజు అన్నారు. పేరవరం, తిరుమాలి, యర్రవరం, నగర పంచాయతీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి రాజశేఖర్‌ను గెలిపించాలని కరపత్రాలు పంచారు. సూతి బూరయ్య, జ్యోతుల పెద బాబు, కోరుకొండ నూకరాజు తదితరులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

### రత్నగిరిపై పోలెండ్ దేశస్థుల నృత్యం



అన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం అనకాపల్లికి చెందిన శ్రీహరిజన కోలాట బృందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపట్టిన కోలాటం భక్తులను అలరించింది. స్వామివారి దర్శనానికి విచ్చేసిన పోలెండ్ దేశానికి భక్తులు అద్భుతం తిలకించి ఆనందపారవశ్యంతో నృత్యాలు చేశారు. అనంతరం కోలాట బృందంతో ఫొటోలు తీయించుకున్నారు.

**విలేకరులపై దాడులు ఖండించాలని ధర్నా**

జగ్గంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విలేకరులపై జరుగుతున్న దాడులు ఖండించాలని బుధవారం జగ్గంపేటలో పాత్రికేయులు నిరసన, ధర్నా చేశారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు హాజరయ్యారు. పార్వతీపురం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగ్గంపేట సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జగ్గంపేట సీఐ వైకుంఠ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురి అరెస్టు**

కోటనందూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఏడుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటంతో కేసులు నమోదు చేశామన్నారు. వీరిని తుని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఫైన్ విధించినట్లు తెలిపారు.

**ఆలయ అభివృద్ధి పనులకు అనుమతి**

అన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. కొరుకొండ ఆలయ బ్రహ్మోత్సవాలతో పాటుగా పలు పనులు పెండింగ్‌లో పడడంతో జిల్లా కలెక్టర్‌కు 15 రోజుల క్రితం లేఖ రాయగా ఆయన అనుమతి ఇచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

**అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు**

గండేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు హైస్కూల్లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను బుధవారం ఎంపీడీవో నాతి బుజ్జి పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, మాస్టర్ ట్రైనర్స్ ఉపాధ్యాయులు గంగాధర్, బాస్కర్, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రాజకీయ ఉనికి కోసమే కృష్ణుడు చౌకబారు మాటలు

**తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ లోవరాజు**



మాట్లాడుతున్న లోవరాజు తదితరులు

తుని రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉనికి కోసమే వైసీపీ నాయకుడు యనమల కృష్ణుడు చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యకర్తలతో కలిసి తుని పట్టణ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ప్రజాతీర్పుతో పదవుల్లోకి వచ్చామన్నారు. ఇన్నేళ్ల రాజకీయ చరిత్రలో నువ్వు ఎప్పుడైనా పోటీలో గెలిచావా అని ప్రశ్నించారు. అన్నా క్యాంటీన్ ధ్వంసం కేసులో అన్యాయంగా కేసులు పెట్టి వేధించిన ఉత్తర మంత్రి దాడిశెట్టితో అంటకాగుతున్నా నీ రాజకీయ చరిత్ర అని ప్రశ్నించారు. యనమల రామకృష్ణుడిని విమర్శించేస్థాయి నీకు ఎక్కడ దని లోవరాజు ప్రశ్నించారు. తమ అభిమాన నేత యనమల రామకృష్ణుడిపై అభాండాలు, ఆరోపణలు పేలితే సహించేది లేదని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్ తెలిపారు. సమావేశంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి చిటికెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఏలేశ్వరంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని విశ్వహిందూ పరిషత్ ఆధ్యక్షుడు అలమండ దుర్గా వెంకట ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మార్ట్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి కటకం కిరీటి నేతృత్వంలో శివాజీ జయంతిని జరిపారు. ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, వి.కామరాజు, ఉడతల రమణారావు, నాగదేవి పాల్గొన్నారు.

**జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి):** ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు జగ్గంపేటలోని తన కార్యాలయంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

**ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి):** ధర్మవరంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం నిర్వహించారు. సనాతన సంప్రదాయం కోసం ఛత్రపతి శివాజీ ఎనలేని కృషి చేశారని వీహెచ్‌పీ ప్రతినిధులు చుక్కల సత్యనారాయణ, రామిరెడ్డి రాజబాబు, నక్కా శ్రీను తదితరులు తెలిపారు. శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుప్పిన నరసింహమూర్తి, గొర్ల శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శివకేశవులను దర్శించుకున్న కాకినాడ ఎంపీ



జగ్గంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో ఏలేరు నదీ తీరాన ఉన్న హరిహరుల ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శివకేశవుల విగ్రహాలను రాష్ట్ర ఆటవీశాఖ చైర్మన్ సుజన కృష్ణ రంగారావు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ దర్శించుకున్నారు. ఆలయాల విశిష్టత గురించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను అడిగి తెలుసుకున్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుజన కృష్ణ రంగారావు మాట్లాడుతూ ఎప్పుడో పురాణాల్లో కోటి లింగాలతో రుద్రాభిషేకం, హరిహరుల విగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలు జరిగేవని చదవడం, వినడమే తప్ప కనులారా చూశామంటే ఆది ఎమ్మెల్యే నెహ్రూ చేసిన గొప్ప యజ్ఞమన్నారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, రేఖ బుల్లిరాజు, రాయవరం శ్రీను, మరిచే రామకృష్ణ, ఉలిసి బాజు, మొగిలి గంగాధర్, సత్యం రాజా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**శివకేశవుల సేవలో రుడా చైర్మన్**

జగ్గంపేట, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరునది తీరాన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రతిష్ఠించిన శివకేశవులను బుధవారం రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి దర్శించుకున్నారు. వారికి ఆలయ పండితులు స్వామి శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందించారు. అక్కడ స్వామి శివకేశవులకు భజన బృందాలు భజనలు చేస్తుండగా జ్యోతుల నెహ్రూతో కలిసి వెంకటరమణచౌదరి తిలకించారు. టీడీపీ జిల్లా నాయకులు కందుల బాబు నాయుడు, రాజానగరం నియోజకవర్గ టీడీపీ నాయకుడు పద్దరాజు పాల్గొన్నారు.

**ఆదిత్యలో వర్క్‌షాప్**

గండేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు డిప్యూటీ ప్రోవోస్టల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌గా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ సర్టిఫైడ్ ట్రైనర్ వి.వీరేంద్ర హాజరయ్యారు. ఇన్వెస్టర్ పెట్టుబడి పెట్టడం ద్వారా ఆర్జించే లాభాలు, మారుతున్న కాలానుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇన్వెస్ట్‌మెంట్ రిస్క్, రిటర్న్ వంటి వాటిలో పరిజ్ఞానం ఆర్జించినప్పుడు మాత్రమే వారికి లాభదాయకమని ఆయన సూచించారు.

**విజయవాడలో 23న విలీన సభ**

జగ్గంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని రామవరప్పాడు వద్ద మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో 23న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విలీనసభ జరుగుతుందని జిల్లా నాయకులు ఎం.ఏసు, జీవరత్నం తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విలీన కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నేతలు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

**కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్**

కోటనందూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తుని- నర్సీపట్నం రహదారిపై నర్సీపట్నం నుంచి తుని వైపు వెళుతున్న కోళ్ల వ్యర్థాలు గల బొలెరో వాహనాన్ని కోటనందూరు పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుకున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. డ్రైవర్ ఇర్రిపాక గ్రామానికి చెందిన ముంగర బాలాజీ, పిఠాపురానికి చెందిన కరకాటి దేవుడును అరెస్టు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. తాండవ నదిలో కోళ్ల వ్యర్థాలను పూడ్చినట్టు ఆయన తెలిపారు.

**కుర్చీలు అందజేత**

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ధర్మవరం భవిత కేంద్రానికి సలాది సత్యనారాయణ బుధవారం కుర్చీలు అందజేశారు. తన తల్లి వీర రామమ్మ జ్ఞాపకార్థంగా కుమారుడు సత్యనారాయణ భవిత కేంద్రంలోని విద్యార్థులకు, పిల్లలకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆయన్ను సీఎంఓ చాముల నాగేశ్వరరావు, ఎంఈవోలు వి.రామబాబు, వై.అచ్చిరాజు అభినందించారు. సీఆర్‌ఎంటీలు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించాలి**

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించాలని జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ చాముల నాగేశ్వరరావు కోరారు. ధర్మవరం జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. సీఎంఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఎంఈవోలు వి.రామబాబు, వై.అచ్చిరాజు, చుక్కల గణేష్, సీఆర్పీలు గంగారావు, బాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


**ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు**



జగ్గంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూను, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను ఇర్రిపాక ఆయన స్వగృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కలిశారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ కృష్ణవర్మ తదితరులు ఉన్నారు.



**అల్లూరి జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ లక్ష్మి**



రంపచోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఆరోగ్య సేవల ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్)గా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో గైనకాలజీ సివిల్ సర్జన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె.లక్ష్మిని నియమించారు. ఈ మేరకు సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ పోస్టులో ఆమె మూడు నెలల కొనసాగుతారు.

**ఛత్రపతి శివాజీ జయంతి**

చింతూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం చింతూరులో ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పయ్యాల నాగేశ్వరరావు, బొజ్జ పోతురాజు, గడ్డం సురేష్, బాలాజీ, బాస్కరాచారి, విష్ణు, జంపన్న, ప్రదీప్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**మరో ముగ్గురిపై పిచ్చికుక్కల దాడి**

ఎటపాక, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపాక గ్రామంలో పిచ్చికుక్కలు బుధవారం మరో ముగ్గురిపై దాడి చేశాయి. తిరుమల వెంకటేష్, మడకం మంగయ్య, జి.నాగేశ్‌లు గాయపడ్డారు. వారిని నెల్లిపాక పీహెచ్‌సీలో డాక్టర్ ప్రత్యూష్ పర్యవేక్షణలో చికిత్స అందించారు.

**దివ్యాంగులకు పరికరాలు ఉచితంగా పంపిణీ చేయాలి**

దేవీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పరికరాలను ఉచితంగా పంపిణీ చేయాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ వికలత్వ పెన్షన్ పొందుతున్న సుమారు 60 మందిని రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సదరం పునః పరిశీలన శిబిరానికి తీసుకెళ్లామన్నారు. సదరం సర్టిఫికెట్లు, కొత్త పెన్షన్లు పెట్టుకునేందుకు స్లాట్ బుక్ చేసేందుకు సైట్ ఓపెన్ చేయాలన్నారు. ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, బందారు వీరబాబు, తుర్రం శ్రీను, వాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

**కూనూరు ఆసుపత్రికి సిబ్బందిని నియమించండి**

కూనవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలకు అందుబాటులో ఉన్న కూనూరు ఆసుపత్రిలో సిబ్బందిని వెంటనే నియమించాలని కూనవరం ఎంపీపీ పాయం రంగమ్మ కోరారు. ఆసుపత్రిలో కీలక ఉద్యోగులు లేక ఆ పనులను డాక్టర్ చేసుకోవాల్సి వస్తోందన్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు మరికొన్ని పోస్టులను తక్షణం భర్తీ చేయాలని కోరారు.